# కళ్లులేవుగాని రెక్కలున్నాయి!

సుదర్శనానికి కొద్దిగా చదువున్నది. కొంచెంగా ఆస్తి వుంది. సినిమాలలోనూ, క్రికెట్‌లోనూ మంచి ఆసక్తి వున్నది. వాటిలో పాల్గొనాలనే దురాశాలేదు. లేనిపోని పగటికలలు కనే మనిషికాడు. అతనికి రెండే ప్రగాఢ వాంఛలు: టిప్‌టాప్‌గా డ్రెస్ చేసుకోవటమూ, ప్రేమించిన అమ్మాయిని పెళ్ళాడ్డమూ చూ.

ఇందులో ఒకటి—టిప్‌టాప్‌గా డ్రెస్ చేసుకోవటం—ఐదారేళ్ళుగా, మీ దయవల్ల తీరుతూనేవస్తున్నది. యంగ్ మెన్స కల్చరల్ అసోసియేషన్‌లో రమ్మీ ఆడే పెద్దమనుషులు నడగండి. "పట్నంలో బెస్ట్ డ్రెస్‌మాన వెవరూ?" అని. తడవుకోకుండా సుదర్శనంపేరు చెప్తారు.

దేవుడు మేలుచేస్తే రెండో పగటికలకూడా ఫలించే సూచనలూ పుష్కలంగా కనిపిస్తున్నాయి. మరి పుష్కలంగా!—అదే వచ్చిన చిక్కు. ఒక్క వెంకు చాలు; లేదూ, ఒక్క వాణి చాలు. ఇద్దరైపోయారు. ఇద్దరూ యిద్దరే.

ఒకతె సుదర్శనం వాళ్ళ యింటి దక్షిణపు కిటికీలోంచి చూస్తే వుదయంపూట తమ హాలుగదిలో చదువుకుంటూ కనిపిస్తుంది. అది వెంకు. ఎప్పుడూ తల కొంచెం రేగి వుంటుంది. చెక్కిళ్ళమీదుగా కాంతి జలపాతంలాగా జారిపోతూ వుంటుంది. కొద్దిగా ఎమెన్ రాజం టచ్! పెద్ద కళ్ళు. తరుచు ఆ కళ్ళు వుత్తరంకేసి చూస్తాయి. అప్పుడు వాటిలో జాలీ, ధైర్యమూ, అనుమానమూ కనిపిస్తాయి.

వెంకును సుదర్శనం యేనాడో "ఎంకి" అని పేరు పెట్టేశాడు. "ఎంకివంటి పిల్ల లేదోయ్, లేదోయ్" అనుకునే వాడు. "కళ్ళెత్తితే సాలు కనకాబిసేకాలు" అనుకునేవాడు.

"ఎంకివొంటి పిల్ల లేదోయ్, లేదోయ్" అన్నది నిజం కాదు, కాదు. అదే వచ్చిన చిక్కు. వాణి వుంది. లేకుండా యెలా పోతుందీ? సుదర్శనం వాళ్ళ యింటి వుత్తరపు కిటికీ లోంచి చూడు—రాత్రిపూట; తన బెడ్‌రూమ్‌లో యేదో చేస్తూ కనిపిస్తుంది.

వెంకు అర్థయితే వాణి స్పోర్ట్సు-మన్కడ్ బాటింగ్‌లా వుంటుంది. హజారే బౌలింగ్‌లా గుంటుంది. ఆమెకూడా తరుచు దక్షిణంగా తన కళ్ళను ఫైర్ చేస్తూ వుంటుంది. "వాణి నా రాణి" అనుకుంటాడు సుదర్శనం.

"త్రిభుజప్రణయం", "ప్రేమత్రిభుజం" లాంటి మాటలు సుదర్శనానికి చాలా వెగటనిపిస్తాయి. మోడర్న్ లవ్ సిట్యుయేషన్‌కు సంస్కృతం పనికిరాదు. "ఇద్దరమ్మాయిలు-ఒకబ్బాయీ!" అంటే బాగుంది. "తీన్ తేరా!" అంటే అమంగళం ధ్వనిస్తున్నా, ముక్తసరిగా వుంది.

ఈ యిద్దరిలో యెవరెక్కువో తేల్చేసుకోవటానికి సుదర్శనం తహతహలాడ లేదు. కాళేశ్వరరావుగారైనా యిద్దరి మెళ్ళో పుస్తె కట్టొద్దన్నారుగాని, ఇద్దరు వధువులను చూడవద్దన్నారా? సుదర్శనం ఇరవై యిద్దర్ని గురించి పగటి కలలు కనదలిచినా చట్టం తన్ని అడ్డలేదు. అంచేత అతను ప్రస్తుతానికి యిద్దర్నీ ప్రేమిస్తూ పర్యవసానాన్ని కాలానికి విడిచిపెట్టేశాడు.

"నా కేమో యిద్దరూ ఒకటే. వాళ్ళలో యెవరికి నే నంటే యెక్కువ యిష్టమైతే వాళ్ళది ఛాన్సు!" అనుకున్నాడు సుదర్శనం.

అతను కిటికీల్లోంచి పంపే ప్రేమరాడార్ తరంగాలు అటు వెంకునుంచీ, ఇటు వాణినుంచీ కూడా బౌన్స్ అయి తిరిగి వస్తూనే వున్నాయి. ఇద్దరూ తన యింటికి వచ్చేవాళ్ళే, తనతో మాట్లాడేవాళ్ళే. కాని యెవరూ గమనించనప్పుడు మారమై పోయినట్టుగా ప్రవర్తిస్తారు అప్పుడు వాళ్ళ చూపులకు "వార్ హెడ్స్" యేర్పడతాయి.

ఎందుకు ? ఏమో!

వెంకు అతనితో సినిమాలు గురించి మాట్లాడుతుంది. మాట్లాడుతున్నంతసేపూ నవ్వుతోనే వుంటుంది. ఆ నవ్వు ఏర్ కండిషనింగ్ లాగా వుంటుంది.

వాణి స్పోర్ట్స్ గురించి మాట్లాడుతుంది. వాణి నవ్వితే, పిక్చర్‌కు ప్రేక్షకులిచ్చే అప్లాజ్‌లా వుంటుంది.

తన ప్రణయగాథలో యేర్పడిన అసాధారణ పరిస్థితిని సుదర్శనం చక్కగా గ్రహించాడు. ఒక యంగ్‌మాన్ యిద్దరు గర్ల్స్‌ను, లేదూ ముగ్గుర్ని సరదాగా, లేక ఊసుపోకక, లవ్ చేసినప్పటికీ అన్నిటికీ సమమైన క్లైమ్ వుండటం తటస్థించదు. ఒకతె కొంచెం హెచ్చు బాగుంటే మరొకతె అంత బాగుండదు. ఒకతె హెచ్చు స్నేహం కనబరిస్తే, మరొకతె హెచ్చు ముభావం కనబరుస్తుంది. ఒకతె పెళ్ళాం అయే పాసిబిలిటీ వుంటే మరొకతెకు వుండదు.

వెంకు అండ్ వాణీ కేసులో యివేవీ లేవు. ఇద్దరూ పెళ్ళికావలసిన అమ్మాయిలు. ఇద్దరూ సుదర్శనం శాఖ వాళ్ళే—సంఘాన్ని దుమ్మెత్తిపోసి మంచి వుపన్యాసం దంచే అవకాశం లేదు. ఇద్దరిలో యే ఒకరైనా తనని "గ్లాడ్" గా పెళ్ళాడేటట్టే వున్నారు.

ఇదే సినిమాకథలోని "లవ్ ట్రయాంగిల్" ఐతే హీరో మదనపడి చచ్చేవాడు. సినిమా హీరో కాకపోవటంవల్ల సుదర్శనం మదనపళ్లేదు. అతనుపడే మదనంతా ఒక తెను పెళ్ళాడి రెండో దాన్ని పోగొట్టుకునేటప్పుడు!

వెనకటికి భోజరాజు కాళిదాసు శ్లోకాన్ని, భవభూతి శ్లోకాన్ని త్రాసులోవేసి తూచినట్లుగా సుదర్శనం వెంకునీ, వాణినీ త్రాసులోపెట్టి తూచి యిద్దరూ సమంగా వున్నారని తేల్చుకున్నాడు. కాని, ఆ త్రాసునే సుదర్శనం తల్లిచేతికి స్తే వాణివైపు మొగ్గు చూపివుండేది. కారణం—వాణి తండ్రి తన కాబోయే అల్లుడికి మెక్కువకట్నం యివ్వగలడు. వెంకు వాళ్ళది కొంచెం తక్కువస్థితి

ఆ త్రాసునే సుదర్శనం వాళ్ళ నాన్న చేతికి స్తే వెంకు వేపు మొగ్గుచూపేది. వెంకూవాళ్ళది పెద్ద స్థితికాకపోయినా వాళ్ళవెనక మహావృక్షంల్లాంటి మనుష్యులున్నారు. వెంకు పినతండ్రి రిజర్వు బ్యాంకు డిపార్టుమెంటులో పెద్ద వుద్యోగి. ఆ పిల్ల మేనమామకూడా ఢిల్లీ సెక్రెటేరియట్‌లో యేదో పెద్ద హోదా వెలగబెట్టుతున్నాడు. వీళ్లు పెట్టనికోటలు. పెద్ద హోదాల్లో వున్నారుగదా అని పేదచుట్టాలను చిన్నచూపు చూసేరకంకాదు. ప్రతియేడూ వస్తారు, పదిరోజులుండి వెళ

తారు. వాళ్ళు వచ్చినప్పుడు వెంకువాళ్ళ యిల్లు తిరగాలే. అటువంటి పిల్లను చేసుకుంటే తన కొడుక్కి లాభమని సుదర్శనం తండ్రి నమ్మకం.

తన ప్రేమగాథతాలూకు ఆఖరి సీక్వెన్సు యిలాటి చొప్పదంటు కన్నిడ రేవన్లపై ఆధారపడి వుంటుందని తెలిసీ సుదర్శనం యిద్దరమ్మాయిలను గురించీ సమంగా పగటికలలు కన్నాడు. వాళ్ళలో యెవతె తనకు దక్కకుండా పోయినా తాను డిజప్పాయింట్ కాగూడను చూడండీ!

తన ప్రణయరథం యే కుదుపూ లేకుండా పెళ్ళిపందిట్లోకి నడవగలందులకు తీసుకోవలసిన ప్రికాషన్లన్నీ తీసుకున్నప్పటికీ సుదర్శనానికి "జోల్ట్" తగలనే తగిలింది.

మొన్నటి మార్చి 16న వాణి వాళ్ళమ్మవచ్చి సుదర్శనం వింటుండగానే, "విన్నారా! అమ్మాయికి సమ్మంధం నిశ్చయమైంది. రేపు తాంబూలాలు పుచ్చుకుంటున్నారు" అన్నది.

వరుడు డాక్టరేట్ సంపాదించుకున్న సైంటిస్టు. అమెరికాలో ఆరేళ్ళు వుండి చదువుకుని వచ్చాడు. యూనిసెస్‌వాళ్ళే రెండువేలు జీతమిస్తున్నారు.

"కట్నం పదివేలు చాలునన్నారు. ముష్టి పదివేలు! పిల్లనచ్చి చేసుకుంటున్నారుగానివండి, ఆ సమ్మంధానికి లక్షలు రావుటండీ!" అన్నది వాణివాళ్ళమ్మ.

సుదర్శనం గుండె జారిపోయింది. అతను పడినజాగ్రత్త అంతా ఏమయిందో తెలియదు. వాణికి సమ్మంధం కుదిరినట్టు తెలియగానే అతను తానింతకాలమూ వాణిపైనే అన్ని

ఆశలూ పెట్టుకున్నట్టుగా బాధపడి, ఒక్కసారిగా "సింక్" అయి పోయాడు. వాణి కాబోయే మొగుణ్ణి తిట్టుకున్నాడు. జీతంరాగానేసరా? వట్టిలూఫర్ వెధవా, తాగుబోతూ. ముండల ముఠాకోరూ, సెఫిలిటిక్కూ. నీగ్రో మొగమూ అయిఉంటాడు! ఆ వెధవను చేసుకున్నదో వాడి యావజ్జీవితమూ ఏడుస్తుంది.. బహుశా, ఈరాత్రి వాణి ఒంటరిగా తన దగ్గరికి వచ్చి, ఎలాగైనా యీ పెళ్ళి తప్పించమని బతిమాలుతుంది. ఆమెతో లేచిపోయి, ఏ కలకత్తాలోనో రిజిష్టర్డు మేరేజి చేసుకునే ధైర్యం సాహసాలు తన కున్నాయా? ధైర్యసాహసా లెలావున్నా, అధమం నాలుగైదు వందలు నగదు కావాలి. తన దగ్గిర లేదు. నాన్న నడిగితే యివ్వడు. వాణి సంబంధంకూడా నాన్నకు యేమాత్రం మోజులేదు.

ఆ రాత్రి సుదర్శనం వుత్తరపు కిటికీ దగ్గిర పాతుకు పోయాడు. కాని వాణి కనిపించలేదు. ఒక్కసారి బెడ్‌రూమ్ లోకి వచ్చిందిగాని దక్షిణంగా చూడనేలేదు. మనిషిలో విషాద విచారచ్ఛాయ లేమీ లేవు. "డామ్ ఫూల్!" అని తిట్టుకున్నాడు.

మర్నాడు సుదర్శనం డాక్టరు రాధాకృష్ణమూర్తిని స్వయంగా చూశాడు. తాను అనుకొన్నదంతా పొరపాటే. డాక్టరు హాలీవుడ్ సినిమా స్టార్ బాబులా గున్నాడు. పాతిక వేలు ఖరీదు చేసే లెఫ్ట్‌హాండ్ డ్రైవ్ కారులో వచ్చాడు!... అతన్ని చూశాక సుదర్శనం స్పోర్టివ్‌గా తన ఓటమి ఒప్పేసుకున్నాడు. లక్ష్మి అతన్ని వదిలేసి తనను పెళ్ళి చేసుకుంటే నిజంగా డామ్‌ఫూలే అవుతుంది!

కాగల పని గంధర్వులే తీర్చారన్నట్టు తనకు వెంకు వుండనేవుంది. "రాసోలింటికైన రంగు తెచ్చే పిల్ల నా మొంకి నా గుండె నమిలి మింగిన పిల్ల !"

తన ప్రణయం ఇప్పుడొక దరి చేరింది. ఇప్పుడు తన ప్రేమనీ, కలల్నీ నిరభ్యంతరంగా వెంకుపైన కేంద్రీకరించ వచ్చు !

వెంకుతో వాణి పెళ్ళిగురించి మాట్లాడే నెపంమీద వాళ్ళింటికి వెళ్ళాడు సుదర్శనం. అతన్ని చూడగానే వెంకు వోల్టాస్ మందహాసం ఒకటి పారేసి, లోపలికివెళ్ళి పొగలు గక్కే కాఫీ తెచ్చి యిచ్చింది.

"లిక్కీ గరల్—వాణి" అన్నాడు సుదర్శనం వేళ్ళ మీద వూదుకుంటూ.

"అవును. మంచి సమ్మంధం...ఈ పెళ్ళికి ఎంతలేదన్నా పాతిక, ముప్ఫైవేల ఖర్చు జరుగుతుంది," అన్నది వెంకు.

"అయితేమటుకేం ! వాణి ఇంకనా రాణీ" అన్నాడు సుదర్శనం.

"నేనంత రూఢిగా చెప్పలేను. ఒక లెవెలెలో బతకటానికి అలవాటుపడితే అందులో వుండే మజా తెలియకుండా పోతుంది. అంతకు మించిన సుఖాలే కావాలటవుతాయి. చూస్తూండండి, వాణిలైఫ్ చాలా అసహజంగా వుండబోతుంది."

మర్యాదకోసం, 'ఓ, నో, నో !' అన్నాడుగాని, వెంకు అన్నమాటలు కొంత నిజం లేకపోలేదనీ, రేపు ఆ డాక్టరుతో

వాణి పొందే సుఖంకంటె వెంకు తనతో ఎక్కువ సుఖం పొందవచ్చుననీ సుదర్శనం గుర్తించాడు.

"లవ్" కు ముఖ్యమైన దేమిటి విరామం? విశ్రాంతి! లీజర్! అది తనకు వుండేదాన్లో నూరోవంతు ఆ డాక్టరు కుండదు. వాణికన్న వెంకే అదృష్ట వంతురాలని తేలిపో వచ్చు.

"పోనీ, నీకు ఇంతకన్న లక్కీ మాచ్ వస్తుందని హోప్ చేద్దాం!" అంటూ సుదర్శనం వెంకువద్ద శెలవు తీసుకొని ఇంటికి వచ్చేశాడు.

ఆమర్నాడు — అంటే మార్చి 18 న ఢిల్లీనుంచి వెంకు మేనమామ దిగాడు. వాళ్ళ యింటిముందు నాలుగు కార్లు వెలిశాయి. ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టరు వచ్చి వెళ్లాడు. ఇంకెవరెవరో ఆఫీసర్లు వచ్చారు, వెళుతున్నారు. ఇల్లు వి. ఐ. పీ. క్వార్టర్సుకింద మారిపోయింది.

దక్షిణపు కిటికీనుంచి చూస్తున్న సుదర్శనానికి రక రకాల దుస్తులతో ఎయిర్ ఫోర్స్ యూనిఫారంకూడా కని పించింది. "వెంకు మేనమామకు డిఫెన్స్ పోర్టు ఫోలియో గాని రాలేదు గదా!" అనుకున్నాడతను.

ఇంతలో వెంకు వాళ్ళింటికి వెళ్ళి వచ్చిన అమ్మ సుదర్శనంతో, "చూశావుట్రా? చక్కని కుర్రాడు! వెంకు అదృష్టవంతురాలు." అన్నది.

సుదర్శనం కొయ్యబారిపోయాడు. అతను ఏమీ అడ క్కుండానే తల్లి అంతా చెప్పుకొచ్చింది. వెంకు మేనమామ

వెంకును సంబంధం తెచ్చాడు. తెచ్చాడేమిటి! వెంటపెట్టు కొచ్చాడు. కుర్రాడికి యిరవై రెండేళ్ళ వయసు. ఎయిర్ ఫోర్స్‌లో కాప్టెన్. కట్నాలు తీసుకోట్ట. పెళ్ళి అంతా పాతిక రూపాయల్లో జరగాలని పట్టు పట్టాడు. వెంకును చూస్తూనే తన యిష్టాన్ని తెలిపాడు!

కొయ్యబారివున్న సుదర్శనం అదే స్థితిలో వెంకు వాళ్ళింటికి వెళ్ళాడు. కాప్టెన్ కృష్ణారావును చూశాడు. తన ఓటమిని అంగీకరించాడు. వాణ్ణి కాదని తనను చేసుకుంటే వెంకుకన్న "డామ్‌ఫూల్" వుండదు!

"కంగ్రాచులేషన్స్! హార్టీ కంగ్రాచులేషన్స్!" అంటూ సుదర్శనం కాప్టెన్ చెయ్యి నొక్కి, వెంకుకేసి ఒక పిచ్చినవ్వు నవ్వి, యింటికి వచ్చేశాడు.

శేషచంద్రికా గ్రంథాలయం, తెల్లప్రోలు :: కృష్ణా జిల్లా.